సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 26 । డిసెంబర్ । 2022



పుణ్యకోటి వాహనంపై వెంకన్న తిరువీధి 8లో



గుమ్మిరేవుల.. ఇకపై స్మార్ట్‌గా 8లో



సింహాచలం దేవస్థానానికి ఏజెన్సీ ఉత్పత్తులు 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

- శరభన్నపాలెంలో ఏర్పాట్లు పూర్తి
- 28 వరకు నిర్వహణ

కొయ్యూరు: శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాల క్రీడామైదానంలో సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రాంబాబు తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 13 పురుషులు,13 మహిళల జట్లు కలిపి మొత్తం 25 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు.ఈ పోటీలు అండర్ 19 విభాగంలో జరిగే ఈ పోటీలను అరకు ఎంపీ మాధవి ప్రారంభిస్తారని చెప్పారు. బాలికలకు పెదమాకవరం బాలికల పాఠశాల, బాలురకు శరభన్నపాలెం బాలుర పాఠశాలలో వసతి కల్పించినట్టు చెప్పారు. పోటీలు విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ తెలిపారు.

తండ్రి ఆశయసాధనకు కృషి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడికి ఘన నివాళి



చిట్టినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్ల భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్: తన తండ్రి, పాడేరు మాజీ ఎమ్మెల్యే దివంగత కొట్టగుల్లి చిట్టినాయుడు అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయసాధనకు కృషి చేస్తానని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఆయన వర్ధంతిని ఆదివారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మార్గంలో ఉన్న చిట్టినాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన ఆశయాలకు అనుగుణంగా జీవితాంతం గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో పేదలకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- చింతపల్లిలో 7..
- అరకులోయలో 8..
- మినుములూరులో 9 డిగ్రీలు నమోదు



పాడేరులో మంట కాగుతున్న వృద్ధులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు విజృంభిస్తున్నాయి.పొగమంచు తీవ్రత లేనప్పటికీ చలిగాలులు తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆదివారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏడు డిగ్రీలు,అరకులోయలో ఎనిమిది డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో తొమ్మిది డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



గిరి ముంగిటకే.. సర్కారు వైద్యం

- విలీన మండలాల్లో మెరుగుపడుతున్న సేవలు
- ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులు అవుతున్న యువ వైద్యులు
- అంకితభావంతో పనిచేసేందుకు ఆసక్తి
- గిరి ప్రజల్లో ఆనందం

రాష్ట్ర విభజన అనంతరం ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్న విలీన మండలాలు ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్నాయి. వైద్యసేవల పరంగా ఎంతో వెనుకబడి ఉన్న ఈ మండలాల్లో అంకితభావంతో పనిచేసే వైద్యులు ముందుకు రావడంతో పరిస్థితులు క్రమేపీ మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో గిరిజనులకు వైద్యసేవలు మరింత చేరువలోకి వస్తున్నాయి. ప్రభుత్వ విధానాలు, లక్ష్యానికి.. ఆకర్షితులైన యువ వైద్యులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇచ్చే భారీ వేతనాలను కాదని ఇక్కడ పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలా వైద్య వసతులు మెరుగుపడుతుండటంతో విలీన మండల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



కూనవరం (కోతులగుట్ట)లో 30 పడకల ఆస్పత్రి

కూనవరం: విలీన మండలాల ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో పది పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు ఉన్నప్పటికీ ప్రాథమిక వైద్యం మాత్రమే అందుబాటులో ఉండేది. శస్త్రచికిత్సలు, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం సమీప తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి లేదా రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వీటిని అధిగమించి అన్ని రకాల వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది.

- కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీలో ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న జనరల్ సర్జన్ పోస్టులను భర్తీ చేసింది. ఇప్పటికే చింతూరు అప్‌గ్రేడ్ సీహెచ్‌సీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోటిరెడ్డి ఎనిస్తీషియా కావడంతో ఈ ఇద్దరు వైద్యాధికారులు విలీన మండలాల్లో శస్త్రచికిత్స సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఈ ప్రాంతీయులు భావిస్తున్నారు.
- వైద్యం పట్ల గత ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యాధికారులను, 14 మంది సిబ్బందిని, 90 రకాల మందులను, 60 రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది.
- వైఎస్సార్ క్లినిక్‌ల ద్వారా సచివాలయం పరిధిలో ప్రజలకు వైద్యాన్ని చేరువచేసింది. అత్యధిక వేతనాలు, అన్ని సౌకర్యాలు ఉన్న పట్టణాలను విడిచి పల్లె ప్రాంతాలకు వైద్యులు రావడం అంటే ఆషామాషీకాదు. ఒకరకంగా వైద్యాధికారుల నియామకంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని గుర్తించిన యువ వైద్యులు ఏజెన్సీలో సేవలందించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

భారీ వేతనాన్ని కాదని..

ఈయన పేరు జె.భాస్కర్. స్వస్థలం నెల్లూరు. అక్కడే ఎంబీబీఎస్ చదివారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ విజయవాడలో ఎమ్మెస్ జనరల్ సర్జన్ పూర్తిచేశారు.



హైదరాబాద్‌లోని శ్రీకర హాస్పటల్‌లో పనిచేస్తుండగా ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ చేపట్టిన వైద్యనిపుణుల నియామకాల్లో మార్కులు, అనుభవం ఆధారంగా ద్వితీయ స్థానం వచ్చింది. అప్పటికే కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆయన రూ.4లక్షలు వేతనం పొందేవారు. ప్రభుత్వం ఇచ్చే వేతనం అంతకన్నా తక్కువ అయినప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో జనరల్/ల్యాప్రోస్కోపిక్ సర్జన్‌గా విధుల్లో చేరారు. గిరిజన ప్రాంతంలో సేవచేయడాన్ని వరంలా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

పూర్తిస్థాయిలో సేవలు



విలీన మండలాల్లో వంద శాతం రిఫరల్ లేకుండా సేవలందించేందుకు ప్రయత్నిస్తాం.ఈ ప్రాంత ప్రజలకు గత 26 ఏళ్ల నుంచి సేవలు అందిస్తున్నందున కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నర్సాపురం నుంచి నన్ను చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారి ఆదేశాలను అనుసరిస్తూ ఒక్క కేసును కూడా రిఫర్ చేయకుండా ఇక్కడే వైద్యసేవలందించేందుకు సాయశక్తులా ప్రయత్నిస్తా.

– కోటిరెడ్డి, సూపరింటెండెంట్, చింతూరు ఏరియా ఆస్పత్రి

28 నుంచి దూరవిద్య డిగ్రీ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలోని డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తృతీయ సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుపుతామన్నారు.

పలు పరీక్ష కేంద్రాల మార్పు

నరసన్నపేట ప్రభుత్వ కళాశాల, రాజాం శ్రీ జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో, విజయనగరం ఏజీఎల్ కళాశాల విద్యార్థులు ఎంఆర్(ఏ) కళాశాలలో, బొబ్బిలి రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు డిగ్రీ కళాశాల విద్యార్థులు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, హరిపురం శ్రీ కుమార్ డిగ్రీ కళాశాల విద్యార్థులు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ప్రకాశం జిల్లా పి.ఎం.కె.ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డీఈడీ కళాశాల విద్యార్థులు ఒంగోలులోని సి.ఎస్.ఆర్ శర్మ కళాశాలలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాల నుంచి హాల్ టికెట్లను పొందవచ్చని సూచించారు. ఇతర సమాచారం కోసం 0891 2844163, 2754966 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాత్కాలిక చెరకు కాటా ప్రారంభం

రావికమతం: టి.అర్జాపురం పరిసర గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో స్థానిక పాల్గుణ ధర్మకాటా వద్ద తాత్కాలిక చెరకు కాటాను ఆదివారం సుగర్స్ సిబ్బంది ప్రారంభించారు. మెంబర్లు,నాన్‌మెంబర్లు వద్ద రెండు వేల టన్నులకు పైగా చెరకు ఉంది. ఆ చెరకు ప్రైవేటు క్రషర్లకు తరలిపోతుండడంతో రైతుల విజ్ఞప్తి మేరకు తాత్కాలిక కాటాను ప్రారంభించారు.

మురిసిన పర్యాటకం

- భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- కిటకిటలాడిన సందర్శనీయ ప్రాంతాలు

సాక్షి, పాడేరు/చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. మారేడుమిల్లి, మోతుగూడెం, సీలేరు, చింతపల్లి, లంబసింగి, తాజంగి, చెరువులవేనం, కొత్తపల్లి జలపాతం, వంజంగి హిల్స్, చాపరాయి జలపాతం, మత్స్యగుండం, అరకు పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, రణజిల్లెడ జలపాతాల అందాలు తిలకించేందుకు భారీగా పర్యాటకులు తరలివచ్చారు. ఓ వైపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి గాలులు విజృంభిస్తున్నప్పటికీ పర్యాటకులు మన్యం అందాలు వీక్షించేందుకు శనివారం సాయంత్రం నుంచే పోటెత్తారు. లంబసింగి, వంజంగి హిల్స్ ట్రాఫిక్ రద్దీ నెలకొంది. పొగమంచు అందాలు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

కొత్తపల్లి జలపాతం 2800 మంది సందర్శన

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద వీకెండ్ సందడి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. జలాపాతాలను 2800 మంది తిలకించినట్టు ఎకో టూరిజం మేనేజర్ ఆర్ నవీన్, సూపర్‌వైజర్ అభి తెలిపారు.



చాపరాయి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



జెండాకొండాపై మంచు అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు


డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన చాపరాయి జలపాతానికి తిలకించేందుకు ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో సందడి నెలకొంది. జలపాతం వద్ద కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. చెట్ల కింద వనభోజనాలు చేస్తూ కనిపించారు. చాపరాయిలో థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరి మహిళలతో సందర్శకులు నృత్యం చేస్తూ సందడి చేశారు.

జెండాకొండకు క్యూ..

హుకుంపేట: ఉఅత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొంది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న జెండాకొండా(సీతమ్మపర్వతం) అందాలను చూసేందుకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జెండాకొండలో మంచు అందాలు, అందమైన మేఘాలు, సూర్యోదయం అందాలను ఆసక్తిగా తిలకించారు. తేనెపట్టు గుహలు, థింసా రాళ్లు, ఓలుబెడ్డా గ్రామ సమీపంలోని హుండీ జలపాతం, గుడ్డిగుమ్మి జలపాతం, గొడుగురాయి జలపాతం ప్రాంతాల్లో సందడి చేశారు.

బొర్రాకు రూ.8.10 లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. సుమారు 10,558 మంది పర్యాటకులు తిలకించగా, రూ.8.19 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులు కిటకిటలాడాయి.పర్యాటకులు రాకతో అరకు–విశాఖ ప్రధాన రద్దీగా మారింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎస్‌ఐ రాము చర్యలు చేపట్టారు.



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

నిరాశపర్చిన ప్రకృతి

చింతపల్లి: మండలంలోని చెరువులవేనంలో ఆదివారం పర్యాటకకులు పోటెత్తారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో మంచు కురవకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.



చెరువులవేనంను సందర్శించిన పర్యాటకులు



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



అనంతగిరి మండలంలో బొర్రా గుహలకు పోటెత్తిన పర్యాటకులు

క్రిస్మస్ సందడి

సాక్షి:పాడేరు: జిల్లాలో పాడేరు రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో క్రైస్తవుల పర్వదినం క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లోని క్రైస్తవ మందిరాల్లో ప్రార్థనలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో సందడి నెలకొంది.



పాడేరు కారుణ్య మందిరంలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

అర్హులైన పేదలకు 'కొత్త' కానుక

- నూతన సంవత్సర కానుకగా కొత్త పింఛన్లు, రైస్‌కార్డులు
- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఉమ్మడి విశాఖలో 21,104 కొత్త పింఛన్లు మంజూరు
- జనవరి నుంచి రూ.2,750 పెన్షన్ తీసుకోనున్న లబ్ధిదారులు
- విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అదనంగా రూ.21.05 కోట్ల భారం
- మూడు జిల్లాల్లో కొత్తగా 5,037 రేషన్ కార్డుల మంజూరు

సాక్షి, విశాఖపట్నం : కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ.. పేదలకు నూతన సంవత్సర కానుకను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్, రైస్ కార్డులు మంజూరు చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 5,037 మంది లబ్ధిదారులకు రైస్ కార్డులను, 21,104 మంది అవ్వాతాతలు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. ప్రజా సంకల్ప యాత్రలో చెప్పిన విధంగా పింఛన్ పెంచుకుంటూ వెళ్తామని ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ జనవరి నుంచి అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు పూయించేలా ప్రస్తుతం రూ.2,500 ఉన్న పింఛన్‌ను రూ.2,750 అందించనున్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు రూ.250 అదనంగా పెంపుతో కలిపి విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రూ.21.05 కోట్లు అదనపు భారం పడనుంది.

5,037 రేషన్ కార్డులు మంజూరు

కొత్త సంవత్సరం నుంచి అర్హులైన పేదలకు పౌర సరఫరాల ద్వారా బియ్యాన్ని అందించేలా రైస్ కార్డులు మంజూరు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 5,037 అదనపు రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటికే 4,970 మంది రైస్ కార్డులపై డిజిటల్‌సైన్ కూడా పూర్తయింది. వీటిని ఈ నెలాఖరులోగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు డీఎస్‌వో సూర్య ప్రకాష్ వెల్లడించారు. మరోవైపు ప్రతి కార్డుదారుడికి కిలో కందిపప్పు, అరకిలో చక్కెర అందించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మొత్తం 5.19 లక్షల కిలోల కందిపప్పు, 2.59 లక్షల కిలోల పంచదార ఇప్పటికే గోదాములకు చేరినట్లు డీఎస్‌వో తెలిపారు. ప్రజలంతా కందిపప్పు, చక్కెరని అడిగి మరీ తీసుకోవాలని కోరారు.

కొత్తగా మంజూరైన రైస్ కార్డులు

జిల్లా	కార్డులు
విశాఖపట్నం	1,633
అనకాపల్లి	1,891
అల్లూరి సీతారామరాజు	1,513
మొత్తం	5,037

కొత్తగా మంజూరైన పింఛన్లు

జిల్లా	పింఛన్లు
విశాఖ	6,533
అనకాపల్లి	9,173
అల్లూరి సీతారామరాజు	5,398
మొత్తం	21,104

గో..గో..రయ్..రయ్..గోదావరిపై



పోచవరం వద్ద వాహనాలతో నిండిపోయిన పార్కింగ్ ప్రదేశం



పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకులతో సందడి

వీఆర్‌పురం: పాపికొండల పర్యటనకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఆదివారం 13 బోట్లలో 1080 మంది అందాలు తిలకించేందుకు ఆదివారం వెళ్లారని ఏపీ టూరిజం మేనేజర్ సీహెచ్ పవన్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అడ్వాన్స్ బుకింగ్ కారణంగా సోమవారం కూడా భారీగా సందర్శకులు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. పర్యాటకుల రాకతో పోచవరం బోట్ పాయింట్, పేరంటపల్లి శివాలయం, కొల్లూరు హట్స్ తదితర ప్రాంతాలు కళకళలాడాయి.

దేవీపట్నం: గండిపోశమ్మ ఆలయం వద్ద బోట్ పాయింట్ నుంచి టూరిజం శాఖకు చెందిన బోట్‌తోపాటు మరో 12 బోట్లలో 888 మంది పర్యాటకులు పేరంటపల్లికి తరలివెళ్లారు. సాయంత్రం నిర్దేశించిన సమయానికి పోశమ్మగండి పాయింట్‌కు చేరుకున్నారు.



పర్యాటకులతో పాపికొండలు విహారానికి బయలుదేరిన ఏపీ టూరిజం హరిత బోట్



పోచవరం బోట్ పాయింట్ వద్ద సందర్శకుల సందడి

గుమ్మిరేవుల.. ఇకపై స్మార్ట్‌గా


గుమ్మిరేవుల గ్రామం

- పంచాయతీలో వడివడిగా అభివృద్ధి పనులు
- నాడు మావోయిస్టులకు కేంద్రం
- నేడు అభివృద్ధిలో ఆదర్శం
- ప్రధాన రహదారి నిర్మాణంతో మారిన గ్రామాల రూపురేఖలు


గుమ్మిరేవుల పంచాయతీలో సచివాలయం భవనం

సీలేరు: భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చాక గిరిజన జాతికి కీలకమైన భగత, వాల్మీకి తెగలకు నిలయమైన గ్రామమది.. వందేళ్ల చరిత్ర కలిగిన గుమ్మిరేవుల పంచాయతీ నాడు మావోయిస్టుల కేంద్రం.. అభివృద్ధి జాడ లేని ప్రాంతం..ఏ అవసరమున్నా ఉధృతంగా ప్రవహించే వాగులు.. కొండలు, గుట్టలు దాటి కాలినడకన మైళ్ల దూరం రావాల్సిందే... అడవినే నమ్ముకుని కారుచీకట్లో గిరిజనుల జీవనం...వైద్యం వారికి గగనం.. ఇదంతా గతం... నేడు స్మార్ట్ పంచాయతీగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న గుమ్మిరేవుల.. మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచింది..

ఒక్క రోడ్డుతో..135 గ్రామాల్లో అభివృద్ధి

గుమ్మిరేవుల పంచాయతీ ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు ఉన్న 21 కిలోమీటర్ల రహదారి అభివృద్ధితో నేడు ఆ పంచాయతీ పరిధిలోని 135 గ్రామాల రూపురేఖలు మారాయి. 1987లో అప్పటి ఎమ్మెల్యే సత్యనారాయణ హయాంలో మారుమూల ప్రాంత అభివృద్ధి పథకం పేరుతో గ్రావెల్‌రోడ్డు పనులు జరిగాయి. అప్పటి నుంచి ఆయా ప్రాంత గిరిజనులు అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులను వేరే ప్రాంతాలకు గుర్రాలు, కాలినడకన వేరే ప్రాంతాలకు తరలించే వారు...అయితే గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి కోసం గ్రామస్తులు ఏళ్లతరబడి ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది.

2012–13లో ఆ రోడ్డుకు ఎస్టిమేషన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అనుమతులు వచ్చినప్పటికీ అటవీ అడ్డంకులు, మావోయిస్టుల హెచ్చరికలతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. 2015లో ఆ రోడ్డును ప్రారంభించగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో పూర్తయింది. 21 కిలోమీటర్ల రోడ్డు రూ.14 కోట్లు ప్రభుత్వం వెచ్చించడంతో 135 గ్రామాల్లో అభివృద్ధి జాడలు దర్శనమిస్తున్నాయి.

స్మార్ట్ విలేజ్‌గా.. గుమ్మిరేవుల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కలలు కన్న స్మార్ట్ విలేజ్‌గా గుమ్మిరేవుల పంచాయతీ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. శివారు గ్రామాలు సైతం అభివృద్ధి చెందాలనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షతో ఏజెన్సీలోని పాడేరు నియోజకవర్గంలోని గుమ్మిరేవుల పంచాయతీలో పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు 21 కిలోమీటర్ల రోడ్డుకు రూ.14 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది.. కొంగపాకల వంతెనను రూ.60 లక్షలతో, మాదిగమల్లు వంతెన రూ.2 కోట్లతో నిర్మించారు. రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.21.8లక్షలతో ఆర్‌బీకే, రూ.22 లక్షలతో విలేజ్‌క్లినిక్, సంపద కేంద్రానికి రూ.9.2 లక్షలు, నాబార్డు నిధులు రూ.23 లక్షలతో వాటర్‌ట్యాంకు, జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా రూ.1.27కోట్లతో 19 పనులు పంచాయతీలో జరుగుతున్నాయి. చింతగుప్ప, కమ్మరితోట, చీటిగుంట, తోకరాయి తదితర ప్రాంతాల్లో రహదారులు నిర్మించారు. దీంతో నర్సీపట్నం నుంచి గుమ్మిరేవులకు ఆర్టీసీ బస్సు నడుస్తోంది. అయిదు సెల్‌టవర్ల నిర్మాణంలో ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని 19 గ్రామాల్లో 2,500 జనాభా, 545 గడపలు, 3,288 ఎకరాల సాగుభూమి సాగులోకి వచ్చింది. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అందుతుండడంతో గిరిజనుల ఆనందానికి అవధుల్లేవు.

గంజాయికి దూరం.. పంటల సాగుకు ప్రాధాన్యం

ఏళ్ల తరబడి గుమ్మిరేవుల పంచాయతీ గంజాయి రవాణాకు అడ్డాగా ఉండేది.. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి, నల్లమందు, సారాపై ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు ఏజెన్సీలో గంజాయి నిర్మూలనపై ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మన్యంలో గంజాయి తోటల ధ్వంసం కార్యక్రమం గుమ్మిరేవుల పంచాయతీ నుంచి ప్రారంభమైంది. నేడు ఈ పంచాయతీలో వాణిజ్య పంటల సాగు జోరందుకుంది.

శివారు గ్రామాల్లోనూ మరింత అభివృద్ధి



ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి పథకాన్ని మారుమూల గ్రామాలకు చేరవేస్తూ అభివృద్ధే లక్ష్యంగా అధికారులను ఆదేశించాం. శివారు గ్రామాల్లో సైతం సచివాలయాల ద్వారా మరింత అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, అల్లూరి జిల్లా

గిరిజనుల అభ్యున్నతికి కృషి



గిరిజనుల అభ్యున్నతికి పోలీసు శాఖ సైతం కృషి చేస్తోంది. గంజాయి నిర్మూలన చేపట్టి, మావోయిస్టుల వైపు గిరిజనులు దృష్టి సారించకుండా వారిలో పరివర్తన తీసుకొస్తున్నాం. జనమైత్రి, ఫ్రెండ్లీ పోలీసింగ్, విలేజ్ విజిట్‌లో ప్రతి గ్రామానికి పోలీసులు వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

–సతీష్‌కుమార్, ఎస్పీ, అల్లూరి జిల్లా

ప్రతిపక్షాలకు బుద్ధి వచ్చేలా..



అభివృద్ధి ఎక్కడంటూ ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు గుమ్మిరేవుల పంచాయతీలో జరుగుతున్న పనులే వారికి సమాధానం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామాల్లోనూ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, అందరికీ పథకాలు చేరవేసేలా తమ ప్రభుత్వం పనిచేస్తోంది.

– కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే, పాడేరు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరమైన మేము..సరైన దారి లేక నానా అవస్థలు పడేవాళ్లం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. మా గుమ్మిరేవుల పంచాయతీ పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగింది. గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి జగనన్నకు మేమంతా రుణపడి ఉంటాం.

– కమలమ్మ, సర్పంచ్, గుమ్మిరేవుల

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి


చెట్టును ఢీకొని బోల్తా పడిన వ్యాను


ప్రమాదంలో మృతి చెందిన నరేష్

చింతూరు: మండలంలోని సరివెల వద్ద ఆదివారం వ్యాను అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒంగోలు జిల్లా కందుకూరుకు చెందిన కట్టా నరేష్(40) అనే వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. కందుకూరుకు చెందిన నరేష్, సురేంద్ర ఖమ్మం నుంచి భువనేశ్వర్‌కు వ్యానులో బాతులను తీసుకెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను చెట్టుకు ఢీకొన్న అనంతరం బోల్తా పడడంతో వ్యాను డ్రైవర్ పాండేతో పాటు నరేష్, సురేంద్ర క్యాబిన్‌లో ఇరుక్కుని పోయారు. విషయం తెలుసుకున్న చింతూరు ఎస్‌ఐ యాదగిరి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పొక్లెయిన్ సాయంతో వ్యానును పక్కకు జరిపి అందులో ఇరుక్కున వారిని బయటకు తీశారు. ఈ క్రమంలో నరేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సురేంద్ర, డ్రైవర్ పాండేకు కూడా గాయాలయ్యాయి. వీరికి చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లారీ క్యాబిన్‌లో 72 కిలోల గంజాయి

కోటవురట్ల: కోటవురట్ల మండలం లింగాపురం సమీపంలో లారీ క్యాబిన్‌లో 72 కేజీల గంజాయి పట్టుబడినట్టు ఎస్‌ఐ నారాయణరావు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పోలీస్ సాధారణ తనిఖీల్లో లారీ క్యాబిన్‌లో రెండు బ్యాగులు గుర్తించి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. రాజస్థాన్‌కి చెందిన లక్షీలాల్, గోపాలపురం గ్రామానికి చెందిన వ్యక్తి కలిసి లారీలో గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడిందన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి లారీని సీజ్ చేసినట్టు చెప్పారు. కేసు నమోదు అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.


గంజాయి రవాణాకు ఉపయోగించిన లారీ


పట్టుబడిన గంజాయి బ్యాగులు

సింహాచలం దేవస్థానానికి ఏజెన్సీ ఉత్పత్తులు

ముక్కోటి ఏకాదశి వేడుకలకు హుకుంపేట నుంచి కూరగాయల తరలింపు

హుకుంపేట: సింహాచలం వరహా నృసింహస్వామి దేవాలయంలో నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పూజలకు మన్యం నుంచి కూరగాయలు, అటవీ ఉత్పత్తులను తరలిస్తున్నారు. ఇందులో భాగంగా హుకుంపేట నుంచి సింహాచలం వరహా నరసింహా స్వామి దేవాలయానికి కూరగాయలు, గుమ్మడికాయలు, చింతకాయలు మంగళవారం పంపించారు. ఏజేన్సీలో పండించే కూరగాయలు, చింతకాయలు సేకరించి, కొనుగోలు చేసి వాటిని ప్రత్యేక వాహనంలో సింహాచలం దేవస్థానానికి పంపించామని, వాటిని అన్నసమారాధన తదితర కార్యక్రమాల్లో వినియోగించనున్నట్టు స్థానిక దాత కోరిబిల్లి కనకమహాలక్ష్మి చెప్పారు. రామరాజు, జగమ్మ, మణికంఠ, భవాని, వెంకటేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

భర్తపై దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

రంపచోడవరం: వికలాంగుడైన తన భర్తపై అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు చేపట్టి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు ఉలపల లక్ష్మి రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. జీసీసీలో ఎంసీడబ్ల్యూగా పని చేస్తున్న తన భర్త వెంకన్నపై రెండు నెలల క్రితం అక్కడే తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న చారి అనే వ్యక్తి అకారణంగా వికలాంగుడని కూడా చూడకుండా సహోద్యోగుల సమక్షంలోనే తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడి చేశాడన్నారు. అప్పటి నుంచి తన భర్త డిప్రెషన్‌కు గురై అనారోగ్యం బారిన పడ్డారన్నారు. తోటి ఉద్యోగుల ముందే తనపై దాడి చేయడంతో తీవ్ర అవమానంగా భావించి మనోవేదనకు గురయ్యారని, దీంతో మెదడులోని నరాలు చిట్లిపోయాయన్నారు. ప్రస్తుతం తన భర్త కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దీనికి కారణమైన చారిపై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

స్నేహ గీతం

అనకాపల్లి టౌన్: చోడవరం మండలం అప్పలరాజుపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1984 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం బొజ్జన్నకొండ వద్ద నిర్వహించారు. ఈ బ్యాచ్ విద్యార్థి అయిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకోవడానికి ఆత్మీయ కలయిక ఎంతో దోహదపడుతుందన్నారు. అంతకుముందు ఆయన తనతో చదువుకున్న పూర్వపు విద్యార్థులను అప్యాయంగా పలకరించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సహచర విద్యార్థులతో సంతోషాన్ని పంచుకున్నారు.

‘చలపతిరావుతో అనుబంధం మరువలేనిది’

ముంచంగిపుట్టు: సినిమా రంగంలో విభిన్న పాత్రలు పోషించిన పేరొందిన ప్రముఖ సినీ నటుడు చలపతిరావు హఠన్మరణంతో అభిమానులు విలపించారు. ఈ నేపథ్యంలో ముంచంగిపుట్టు మండల కేంద్రంలో నివాసం ఉంటున్న వ్యాపారి షేక్ రెహ్మాన్ (చంటి) సినీనటుడు చలపతిరావుతో అతనికి ఉన్న అనుబంధాన్ని ఆదివారం విలేకరులకు తెలియజేశారు. చలపతిరావు ప్రోత్సాహంతోనే చిత్రసీమలో అడుగుపెట్టి ‘ఎవరో తానెవరో’ అనే సినిమాను చిత్రీకరించానని, ఆయనతో కలిసి నటించామని ప్రొడ్యూసర్, నటుడు చంటి చెప్పారు. చలపతిరావు మరణం తనను ఎంతో కలిచివేసినట్టు తెలిపారు. చలపతిరావుకు నివాళులర్పించారు.


చలపతిరావుతో రెహ్మాన్ (ఫైల్)

ఆకట్టుకున్న చీకటి పువ్వు నాటిక ప్రదర్శన

నాటక రంగ దర్శకుడు సాంబశివరావుకు నివాళి

మునగపాక: మునగపాక నందీశ్వర ప్రాంగణం తులసీ కళావేదికపై ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ‘చీకటి పువ్వు’ నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నాటకరంగ దర్శకుడు స్వర్గీయ మొతికా సాంబశివరావు 7వ సంస్మరణ సభలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాటికలోని పాత్రదారులు అద్భుతంగా తమ ప్రదర్శన ఇచ్చారు. ఈ నాటికకు పి.ఎస్.నారాయణ మూల కథ అందించగా మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. నాటికను తిలకించేందుకు కళాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా సాంబశివరావు చిత్రపటం వద్ద ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత సాంబశివరావుకే దక్కుతుందన్నారు. పలు సందేశాత్మక నాటికలను అందించిన సాంబశివరావు ఆశయ సాధనకు కళాకారులు పాటుపడాలన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు పలు నాటకాలకు దర్శకత్వం వహించిన సాంబశివరావు సేవలు అజరామరంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, నందీశ్వర నాట్యమండలి అధ్యక్షుడు టెక్కలి సూరప్పారావు, కార్యదర్శి బొడ్డేడ ధర్మరాజు, కళాకారులు మల్ల సంజీవరావు, టెక్కలి కొండలరావు, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, మళ్ల కృష్ణ, మళ్ల చిన జగ్గప్పారావు, సాంబశివరావు కుటుంబ సభ్యులు సన్యాసిరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు ఘన సత్కారం నిర్వహించారు.


చీకటి పువ్వు నాటికలోని సన్నివేశం

పొలంలో రైతుపై దుండగుల దాడి

చోడవరం రూరల్: రాత్రి సమయంలో పొలానికి వెళ్లిన రైతు తల పగులగొట్టిన దుండగుల ఉదంతమిది. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సంఘటన మండలంలోని బెన్నవోలు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు పోతిమంతి పోతురాజు కుమారుడు ఆంజనేయ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం తన తండ్రి శనివారం రాత్రి 9 గంటలకు ఎప్పటిలాగే కల్లంపాకలకు పడుకోవడానికి వెళ్లాడు. ఆదివారం తెల్లవారు 5 గంటలకు ఆంజనేయులు కల్లానికి వెళ్లగా అతని తండ్రి పోతురాజు తలకు గాయంతో తీవ్ర రక్త స్రావంతో పడి ఉన్నాడని, అతడిని తక్షణం చోడవరం ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన శానాపతి పెద్ద కన్నంనాయుడుకి తాము ముప్పై వేల రూపాయలు అప్పుగా ఇచ్చామని, ఆ సొమ్ము తిరిగి చెల్లించాల్సిందిగా వారం రోజుల క్రితం అడిగామని, దీనిపై అతడితో తమకు గొడవ చోటుచేసుకుందని, ఆ కారణంగా కక్ష పెంచుకుని శానాపతి పెద్ద కన్నంనాయుడు, అతని బంధువులు తన తండ్రి పోతురాజుపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి ఉంటారని అనుమానం వ్యక్తం చేసినట్టు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపారు.

ఆలయ హుండీ చోరీ


దొంగలు పగులగొట్టిన హుండీ

ఎస్.రాయవరం: కొరుప్రోలు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో హుండీ చోరీకి గురయ్యిందని దేవదాయశాఖ ఈవో మురళి తెలిపారు. గ్రామాల్లో అర్ధరాత్రి గర్భగుడి సమీపంలో ఉన్న గేటు తలుపులు తాళాలు పగుల గొట్టిన దొంగలు హుండీ తెరిచి అందులోని రూ.9 వేలు నగదు దోచుకెళ్లారని తెలిపారు. కాగా ఆలయంలో ప్రధాన హుండీ, మరో చిన్న హుండీ చోరీకి గురికాలేదన్నారు. అమ్మవారి ఆభరణాలు కూడా భద్రంగా ఉన్నయన్నారు. ఈ మేరకు ఎస్.రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఉపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలి

అడ్డతీగల: పెళ్లి చేసుకోవాలని విద్యార్థినిపై ఒత్తిడి చేస్తున్న ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయినిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీల సంక్షేమ చైతన్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ సంఘటన జరిగినట్టు పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయినిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న నాయకులు, స్థానికులు

బుచ్చెయ్యపేట: మండలంలోని చిన అప్పనపాలెం గ్రామం వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. దిబ్బిడికి చెందిన చిన్ని ముత్యాలు పిల్లలతో క్రికెట్ ఆడుతూ పడిపోవడంతో ఆయన కాలికి గాయమైంది. అతన్ని ఆటోలో వడ్డాది ఆస్పత్రికి తరలిస్తుండగా చిన అప్పనపాలెం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముత్యాలుతో పాటు అతని పెద్దమ్మ చిన్ని రాములమ్మ, తమ్ముడు లక్షణ, ఆటో డ్రైవర్ తాటికొండ గణేష్ గాయపడ్డారు. వారిని 108లో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో అటు వైపు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు స్థానికులతో కలిసి క్షతగాత్రులను వాహనంలోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో రోనిత్ ఘనత


ఉదయపూర్‌లో బహుమతిని అందుకుంటున్న రోనిత్ శివజోగ్

అనకాపల్లిటౌన్: రాజస్థాన్‌లో జరిగిన అంతర్జాతీయ చదరంగ పోటీల్లో అండర్–7 విభాగంలో టాప్ 10గా అనకాపల్లికి చెందిన బొడ్డేడ రోనిత్ శివజోగ్ నిలిచాడు. ఉదయపూర్‌లో ఇటీవల నిర్వహించిన ప్రేమ్ చంద్ మోగ్రజి వింటర్ కప్ క్లాసికల్ 1600 ఫిడ్ రేటింగ్ లేక్ సిటీ ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీలకు 410 మంది వివిధ రాష్ట్రాల భారతీయులు, ఎన్‌ఆర్‌ఐలు, అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, సత్యదేవ్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు బొడ్డేడ జోగారావు మనుమడు బొడ్డేడ రోనిత్‌శివజోగ్ టాప్ 10గా నిలవడం పట్ల తల్లిదండ్రులు సీఏ కృష్ణ, గీతాంజలి ,చెస్ టీచర్ మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు.

పుణ్యకోటి వాహనంపై వెంకన్న తిరువీధి


స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. గరుడాద్రి పర్వతంపై కల్కిఅవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు

ఈసందర్భంగా వేకువ జామున

నిత్యార్చనలు అభిషేకాలు జరిపారు. అనంతరం క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారికి విశేషపూజలు చేశారు. తరువాత నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థగోష్టి నిర్వహించారు. పుణ్యకోటివాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు కానుకలు, మొక్కుబడులు సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై ప్రవ పాశురాన్ని విన్నపం చేశారు. ఈకార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు,శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు, నరసింహాచార్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు.